మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ప్రతి రైతుకు 120 గజాల స్థలాన్ని కేటాయించాలి

**పటాన్‌చెరు, జూలై 14,ప్రభాతవార్త:**

జిన్నారం మండలంలో సర్వే నంబర్ 1లోని 420 ఎకరాల రైతుల సాగు భూములను టీజీ ఐఐసీ హెచ్ఎండీఎలకు కేటాయించారని, వెంటనే వాటిని రద్దు చేయాలని తహసీల్దార్ బిక్షపతికి రైతులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్‌కు ఆర్డీవో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించామని అయినా కాని పట్టించుకోవట్లేదని, అత్యున్నత న్యాయస్థానం హైకోర్టులో కేసు వేశామని, కేసు కోర్టులో ఉన్న ఇక్కడ అక్రమ నిర్మాణాలు ఆగట్లేదని, రైతులు వాపోయారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి రైతుకు 120 గజాల చోప్పున స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని, అవసరమైతే అంశాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తిసుకెళ్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గోన్నారు.

## పార్టీ వీడే నాయకులతో నష్టం లేదు

**బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మల్లికార్జునరెడ్డి**

**హుస్నాబాద్, జూలై 15, ప్రభాతవార్త :** అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి అధికారం కోల్పోయాక పార్టీని వీడి నాయకులతో బిఆర్ఎస్ పార్టీకి ఎలాంటి నష్టం లేదని ఆ పార్టీ అధికార ప్రతి నిధి అయిలేని మల్లిఖార్జునరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పార్టీలు మారే నాయకులు తమకు పదవులు ఇచ్చిన పార్టీ ఏదో గుర్తుంచుకోవాలని ఇలాంటి వారు పార్టీలో ఉండడం వల్లే రాష్ట్రం లో ప్రభుత్వం అధికారంలోకి రాలేకపోయిందన్నారు. ఇలా పార్టీని వీడి ఎంత మంది వెళ్లినా పార్టీకి జరిగే నష్టం లేదని ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ కెసిఆర్ ఒంటరిగా పోరాటాలు నిర్వహించి ప్రత్యేక రాష్ట్రం తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చేరికల పై పెట్టిన దృష్టిలో సగం అయినా అభివృద్ధి, ఇచ్చిన హామీల అమలుపై పెడితే బాగుంటుందని హితవు పలికారు. పార్టీని వీడిన వారిని వొదిలిపెట్టి రాష్ట్ర తొలిముఖ్యమంత్రి కెసిఆర్, హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్‌ల నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసుకుంటామన్నారు. పార్టీలు మారే నాయకులు ఆత్మవిమర్శ చేసుకుని మారాలని సూచించారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లా నలుమూలల నుంచి సమస్యలు పరిష్కరించుకోవడానికి ప్రజలు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటారని ప్రజావాణి దరఖాస్తులను నిర్ల క్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా వాణిలో అమె దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణి అనేది గొప్ప కార్యక్రమం అని సామాన్యులకు అందుబాటులో ఉండి తమ సమస్యలను విన్నవించుకోవడానికి పరిష్కరించుకోవడానికి ఒక చక్కని వేదిక అన్నారు. ప్రజావాణిపై ఎంతో నమ్మకంతో ప్రజలు తమ సమస్య లను పరిష్కరించుకోవడానికి వస్తుంటారని న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో డిఅర్ఓ నాగ రాజమ్మ, డిఅర్డిఎ పిడి జయదేవ్అర్యా, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## అధికారులు జవాబుదారుగా పనిచేయాలి

**-అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**



దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**సంగారెడ్డి బ్యూరో, జూలై 15 ప్రభాతవార్త:** అధికారులు జవాబుదారుగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఆడిటోరియంలో ప్రజల నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అనదపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా వాణిలో ఏయే శాఖల వద్ద ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయో తెలుపాలని ఆదేశించారు. ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తులు ధరణి 43, పెన్షన్స్ 12, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు 18, ఇతర దరఖాస్తులు 71 మొత్తం 144 స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రజావాణిలో ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించాలి

**-జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్**



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్

**మెదక్ అర్బన్, జూలై 15 ప్రభాతవార్త:** ఫిర్యాదుదారుల సమస్యలను చట్టప్రకారం పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ మండలం పాల్వంచ గ్రామానికి చెందిన పులి మల్లేశం తన స్వంత భూమి సర్వే నెంబర్ 235/అ లో పత్తి వేశామని, మా గ్రామానికే చెందిన కొందరు వ్యక్తులు ఈ నెల 11వ తేదీన ఉదయం ఎండ్ల గుంగుటకతో మా పత్తి చేనును దున్ని వేశారని, అడిగితే నిన్ను, నీ కుటుంబాన్ని చంపేస్తామని బెదిరిస్తున్నారని, పత్తి చేను ధ్వంసమై లక్ష రూపాయల నష్టం జరిగిందని, కావున మాకు నష్టం కలిగించి మమ్మల్ని చంపుతామని బెదిరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా, చట్ట ప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయాలని అల్లాదుర్గ్ సీఐకి అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ సూచించారు. అలాగే మెదక్ పట్టణానికి చెందిన మ్యాదరి రమ యాదగిరి అనే వ్యక్తి ఈ నెల 9వ తేదీన గడ్డపారతో నా ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లో ఉన్న టీవీని పగులగొట్టాడని, అడితే తనపై దాడికి వస్తున్నాడని, కావున అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా, చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయాలని మెదక్ పట్టణ సీఐకి అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ సూచించారు.

## వర్షాలు కురవాలని కంగ్టిలో పూజలు

**కంగ్టి, జూలై 15 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సోమవారం వీరాంజనేయ దేవాలయం నుంచి ఆయా వీధులగుండా నిండు బిందెలతో గ్రామస్థులు పూజలు నిర్వహించారు. గ్రామంలోని యువకులు, పెద్దలు కలిసి వర్షాలు కురవాలని వానదేవునికి నిండు బిందెలతో భాజ భజాంత్రీలతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అన్నదానం నిర్వహించి వ్యాపార దుకాణ సముదాయాలు మూసివేసి ఈ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



కంగ్టిలో వీరాంజనేయ స్వామికి నీళ్ల అభిషేకం

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించాలి

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**సంగారెడ్డి బ్యూరో, జూలై 15 ప్రభాతవార్త:**

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్టీసీ, విద్య, డీఆర్‌డీవో, ఆరోగ్య, పంచాయతీ, వ్యవసాయ, పౌరసరఫరాలు, అటవీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ శాఖల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రయాణికుల సౌకర్యాలను, బస్సు డిపోలలో పరిశుభ్ర కార్యక్రమాలను, ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఎంత మంది మహిళలకు లబ్ధిచేకూరురిందో అడిగి తెలుసున్నారు. డీఆర్డీవో అధికారులను స్వయం సహాయక గ్రూపులకు అందించే సహాయ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యాశాఖపై మాట్లాడుతూ జిల్లాలో పాఠశాలల పునఃప్రారంభం తరువాత విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ వివరాలను పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశాఖపై జిల్లాలో డెంగ్యూ, మలేరియా వ్యాపించకుండా తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పంచాయతీ శాఖపై గ్రామస్థాయిలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలు, త్రాగునీరు, రైతు భరోసా, ఎరువులు, విత్తనాలు, విద్యుత్ లాంటి వివరాలను తెలుసుకున్నారు.

పౌరసరఫరాల అధికారులను రేషన్ బియ్యం, గ్యాస్ సరఫరాలపై ఆరా తీశారు. అటవీ శాఖ అధికారులతో జిల్లాలో నాటే మొక్కల లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీనివాసరావు, విద్యాశాఖ అధికారి రాధా కిషన్, వ్యవసాయ అధికారి గోవిందు, జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, అటవీ అధికారి రవికుమార్, పంచాయతీ అధికారి యాదయ్య, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**వన మహోత్సవంలో ప్రజలు భాగస్వామ్యం కావాలి**

**సంగారెడ్డి బ్యూరో, జూలై 15 ప్రభాతవార్త:**

వనమహోత్సవంలో జిల్లా ప్రజలు భాగస్వామ్యం కావాలని, జిల్లాలో 34 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాహుల్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవంలో జిల్లా ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లాలో 34 లక్షల మొక్కలు నాటేలా లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో 15 లక్షల మొక్కలు నాటారని, మిగిలిన మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్డుకు ఇరు వైపులా, ఇరిగేషన్ స్థలాల్లో, చెరువలు, నదుల పరివాహక ప్రాంతాల్లో, అటవీ భూముల్లో మొక్కలు నాటడానికి అనువైన స్థలాలు గుర్తించి మొక్కలు నాటే కార్యక్రమ కొనసాగిస్తున్నామని అన్నారు. చెట్లను నాటడమే కాకుండా వాటిని పరిరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. భవిష్యత్ తరాల కోసం చెట్లు నాటి వాటిని పరిరక్షిస్తే ప్రకృతిని పరిరక్షించినట్లుగా పేర్కొన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో జిఆల్ల ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా అటవీ అధికారి రవికుమార్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వూడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

**గజ్వేల్, జూలై 15 (ప్రభాతవార్త):** రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకురాలు వూడెం సారిక శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బిజెపి పార్టీ కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదని, దేశంలోని 10 రాష్ట్రాలలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను కూల్చిన ఘన చరిత్ర ప్రధాని నరేంద్రమోడిదే అన్నారు. బిజెపి పార్టీ పదే పదే ఫిరాయింపుల గురించి మాట్లాడుతుందని, ఫిరాయింపుల గురించి మాట్లాడే అర్హత పార్టీకి లేదన్నారు. ఫిరాయింపులకు ఆజ్యం పోసింది మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలోనే రాష్ట్రం బాగుంటుందని, బిఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు లైన్లు కడుతున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూనే రైతులు ఎదిరిచూస్తున్న రూ.2 లక్షల పంట రుణమాఫీ సైతం త్వరలోనే చేయనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ తదితర పథకాల అమలుతో పేదలు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీయే అని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు.

### కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు

**నర్సాపూర్, జూలై 15, ప్రభాతవార్త:** కోండపోచమ్మ సాగర్ నుండి సంగారెడ్డికి వెళ్లె కెనాల్ రీజ్ టు కాలువ మాకొద్దంటూ నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తాలో భూ నిర్వాసితులు చేపట్టిన రీలే నిరాహార దీక్ష సోమ వారం నాటికి నాల్గవ రోజుకు చేరింది. గత నాలుగు రోజులుగా భూ నిర్వాసితులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు అధికారులు ఏవరు స్పందించడం లేదని వారు వాపోయారు. అధికారులు స్పందించే వరకు రైతులు ఈ రిలే నిరాహార దీక్షలను కొన సాగుతాయని వారు హెచ్చరించారు. ఈ రోజు చిన్న చింతకుంట గ్రామ రైతులు అంజాగౌడ్, సాయిరాం గౌడు, శ్రీశైలం యాదవ్, హన్మంత్ గౌడు మరియు సురేష్ గౌడు తదితరలు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో కూర్చున్న చిన్న చింతకుంట గ్రామస్థుల దృశ్యం



జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న లింగాల సురేష్

## విద్యార్థులను వేధిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

**-ధర్మ స్టూడెంట్స్ యూనియన్ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ లింగాల సురేష్**

**ములుగు, జూలై 15 (ప్రభాతవార్త):** సిద్దిపేట జిల్లాలోని ములుగు మండలం లక్ష్మక్కపల్లి వద్ద ఉన్న ఆర్‌విఎం మెడికల్ కళాశాల, గజ్వేల్ మండల పరిధిలోని సురభి మెడికల్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులను మానసికంగా వేధిస్తూ లోబరుచుకునే ప్రయత్నం చేస్తున్నారని ధర్మ స్టూడెంట్స్ యూనియన్ ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ లింగాల సురేష్ ఆరోపించారు. ఈ సందర్భంగా సోమ వారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగాల సురేష్ మాట్లాడుతూ సురభి మెడికల్ కళాశాలలో హాస్టల్ విద్యార్థులకు సరైన భోజనం పెట్టడంలేదని, మెనూ పాటించడంలేదన్నారు. ఈ రెండు మెడికల్ కళాశాలలపై తగు చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

**-జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి**

గజ్వేల్, జులై 15 (ప్రభాతవార్త):రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణానికి వచ్చిన సందర్భంగా దౌల్తాబాద్ మాజీ ఎంపిపి రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చేతిరెడ్డి వెంకట్రాంరెడ్డి, కన్నాయాదవ్, మామిడి సురేష్‌గౌడ్, ఫనిధర్, శ్రీనివాస్‌గౌడ్‌లు శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతుందని, గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, అందులో భాగంగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. మరో 20 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీయే రాష్ట్రంలో ఉంటుందని, ప్రతిపక్ష పార్టీలు కనుమరుగు కావడం ఖాయమన్నారు.



ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



కెజిబివి రికార్డులు తిరిగి ఇస్తుండగా కెమెరకు చిక్కిన దృశ్యం

## కస్తూర్బా పాఠశాలలో ఏం జరుగుతోంది..?

**కెజిబివి రికార్డులు తిరిగి ఇస్తుండగా కెమెరాకు చిక్కిన వైనం**

**పాఠశాలను పట్టించుకునే వారే లేరా...**

**టేక్మాల్, జూలై 15, ప్రభాతవార్త:** ఈనెల 12వ తేదీన విధి నిర్వహణలో కెజిబివి.. అడుగడున నిర్లక్ష్యమే..! అన్న శీర్షికతో పాటు ఈ నెల 13న 'టేక్మాల్ కెజిబివి రికార్డులు తారుమారు చేసే ప్రయత్నం, ఎస్ఓ ఇంటికి వెళ్లిన రికార్డులు' అనే మరో శీర్షికతో వరుస కథనాలు వెలువడిన విషయం పాఠకులకు విధితమే. శుక్రవారం టేక్మాల్ కేజిబివి నుంచి తీసుకెళ్లిన రికార్డులు తిరిగి టేక్మాల్ కస్తూర్భాలో ఇస్తున్న క్రమంలో దృశ్యం 'వార్త కెమరా'కు చిక్కింది. ఈ విషయం అపరిచిత వ్యక్తిని అడుగుదామని కారును అపితే అపకుండా అతివేగంతో అక్కడి నుండి వెళ్లిపోవడంతో కారును విలేకరులు సాలొజిపల్లి వద్ద అపినఎందుకు పారిపోతున్నారని నిలదీయగా తాను పారిపోవడంలేదని పెద్దశంకరంపేట మండలం బుజరన్‌పల్లి హరిజనవాడ ప్రభుత్వ పాఠశాలలో విజయ్ అనే నేను ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్నని అందుకే వెళ్తున్ననంటూ నిజాన్ని ఒప్పుకున్నారు. కస్తూర్భా పాఠశాలకు, మీకు సంబంధం ఏంటని ప్రశ్నించగా యస్ఓ బాలమణి తనకు అక్క మెడికల్ లీవ్‌లో ఉందని, 16వ తేదీన అడిటింగ్ ఉందని అందుకు ఆమె సంతకాలు అవసరమని ఆమె తీసుకు రమ్మంటేనే ఆ రికార్డులను శుక్రవారం తీసుకెళ్లి తిరిగి టేక్మాల్ కస్తూర్భా పాఠశాలకు సోమవారం ఇచ్చానని ఒప్పుకున్నారు. టేక్మాల్ మండల కస్తూర్భా పాఠశాలలోనే ఎందుకు ఇలా ఆరోపణలు వస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం అసలు కస్తూర్భా పాఠశాలలో అసలు ఏం జరుగుతుంది. అనే విషయంపై విచారణ చేయాల్సిన జిల్లాస్థాయి విద్యాధికారులు ఎందుకు స్పందించడం లేదని పలు అనుమానాలు వస్తున్నాయి. కస్తూర్భాలో జరుగుతున్న నిర్లక్ష్యపు విధుల పట్ల ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా సమాగ్ర విచారణ జరుపాలని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

## చెరువులు, కుంటలు నింపి రైతాంగాన్ని ఆదుకోవాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి**



అందోళన చేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, జూలై 15, ప్రభాతవార్త :** చెరువులు, కుంటలు నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని..గోదావరి నీటితో రిజర్వాయర్లు నింపాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం కార్యకర్తలతో కలిసి పార్టీ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను గోదావరి నీటితోనింపి కాలువల ద్వారా చెరువులు, కుంటలు నింపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకున్న పాపానపోవడం లేదన్నారు. రైతులను చిన్న చూపు చూస్తే అందోళనలు చేస్తామన్నారు. తపాస్ పల్లి రిజర్వాయర్ నింపితే మద్దూరు, చేర్యాల, దూళ్‌మిట్ట, కొమురవెల్లి మండలాల రైతులకరు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు బద్దిపడగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్,అత్తిని శారద, బండ కింద అరుణకుమార్, తేలు ఇస్తారి,సాయిలు, బాలకిషన్,చక్రపాణి,యాదయ్య, సత్తయ్య, చంద్రారెడ్డి, బాలస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### బివిఆర్ఐటిలో డిఎన్ఎ సీక్వెన్సింగ్ అనాలసిస్‌పై వర్క్‌షాప్

**ప్రారంభించిన జపాన్ వర్సిటీ ప్రొ. యుకి యోనగానో**

**నర్సాపూర్, జూలై 15, ప్రభాతవార్త:** నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో 'డిఎన్ఎ సీక్వెన్సింగ్ అనాలిసిస్' అనే అంశంపై రెండు వారాలపాటు అంతర్జాతీయ వర్క్ షాప్‌ను నిర్వహించనున్నారు. ఈ కార్య క్రమాన్ని ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా జపాన్ దేశ విశ్వవిద్యాలయం ప్రొఫేసర్ యుకి యోనగానో విచ్చేయగా ఇంజనీరింగ్ కళాశాలలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుండి 27 వరకు అంతర్జాతీయ వర్క్‌షాప్‌ను కొనసాగేలా ఆయన ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జపాన్ దేశ సగా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ యుకి యోన గానో మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల మధ్య పరిశోధన సహాకారం, పరిశోధన ప్రాజెక్టులపై జపాన్ భారత్ల మధ్య డిఎన్ఎ సీక్వెనింగ్స్ అనాల్సిస్పై పై నిధుల పరిశోధనపై విద్యార్థులకు మరియు అధ్యాపకులకు పరిశోధన అంశాలపై ప్రసంగించారు. ఈ రకమైన పరిశోధనలు చాల ముఖ్యమైనవి అన్నారు. పరిశోధనలో సందర్భానుసారంగా ఔషద రంగాల్లో నిరంతరం కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథితో డాక్టర్ యోక్యో నగనూతోపాటు కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే, విఐపిఇఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ రమేష్, డాక్టర్ వి. విష్ణు,హెడ్-ఫార్మసీ విభాగం, బివిఆర్ఐటి నర్సాపూర్ మరియు డాక్టర్ రాజు ఆడేలా, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ డీన్‌లతోపాటు వివిధ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌ను ప్రారంభించిన ప్రొ. యుకి యోనగానో

## ఆర్ఆర్ఆర్ భూపరిహారంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ అర్బన్, జూలై 15 ప్రభాతవార్త:**

ఆర్ఆర్ఆర్ భూపరిహం విషయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నర్సాపూర్ నియోజక వర్గంలోని రెడ్డిపల్లి గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. రెడ్డిపల్లి, గ్రామ వ్యవసాయ భూమి ఆర్ఆర్ఆర్‌లో పోతుందని, దానివల్ల గ్రామ ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందని, ఆర్ఆర్ఆర్ ఆలైన్‌మెంట్ మార్చాలని, పరిహారం పెంచాలని గ్రామ రైతులు కలెక్టర్ రాజ్ దీష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రెడ్డిపల్లి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. అలైన్‌మెంట్ మార్చడం వాలు కాదని, అయినప్పటికీ ప్రభుత్వం దృషికి విషయం తీసుకెళ్తానని, పరిహారం పెంపు విషయంలో అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. రైతులందరూ సమన్వయంతో ఉండాలన్నారు. పరిహారం పెంపు విషయంలో ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఆవుల రాజిరెడ్డి, ఆజనేయులుగౌడ్, సత్యనారాయణగౌడ్, మహేష్‌గౌడ్, సత్యనారాయణ, నిరంజన్, నగేష్‌గౌడ్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

## తోపు బండి బాధితురాలికి అండగా కార్పొరేటర్



బాదితురాలని పరమార్శిస్తున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, జూలై 15 ప్రభాతవార్త:** రాత్రి కురిసిన వర్షపు ముంపు ప్రాంతాల్లో సోమవారం కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పర్యటించారు. సమస్యలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. వర్షానికి నాచారం పోలీస్ స్టేషన్ వెనుక వైపు ఉన్న రోడ్డులో శిథిలావస్థలో ఉన్న ఓ గోడ కూలిపోయింది. దీంతో గోడ పక్కన పార్క్ చేసిన తోపుడు బండి నలిగిపోయి చిత్తు చిత్తు అయింది. దీంతో విషయంతో తెలుసుకున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ బాదితురాలైన సునీతతో మాట్లాడి పరమార్శించారు. 12 సంవత్సరాలుగా తోపుడు బండితో జీవనం సాగిస్తున్నారని ఆమెకు కొత్త తోపుడు బండిని తన స్వంత ఖర్చుతో ఇప్పిస్తానని హామినిచ్చారు. మంపు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగింపజేయించినట్లు కార్పోరేటర్ తెలిపారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం



**అత్తాపూర్ జూలై15,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ మండల పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో రోడ్డు ,విద్యుత్తు దీపాలు లేక భక్తులు,కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిటీ సభ్యులు డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.వెంటనే స్పందించిన కార్పొరేటర్ ఇచ్చిన హామీ ప్రకారం బాబుల్ రెడ్డి నగర్ శ్రీపోచమ్మ తల్లి దేవాలయం వద్ద సిసి రోడ్డు, సెంట్రింగ్ పనులు సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు రమేష్ రెడ్డి,సెంట్రింగ్ శంకర్ శేఖర్, కాలనీవాసులు కార్పొరేటర్ ధన్యవాదాలు తెలియజేశారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి -డిసి రవి కుమార్



**అత్తాపూర్ జూలై15,ప్రభాతవార్త :** సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు.సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్‌లోని జిహెచ్ఎంసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురి నుండి 4 ఫిర్యాదులను డిసి రవి కుమార్ స్వీకరించారు.ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ....రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఎవైనా సమస్యలు వెంటనే ప్రజావాణి ద్వారా తమ సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు.ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.ప్రతి ఒక్కరూ ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బోనాల చెక్కులు పంపిణీ

**అల్వాల్, జూలై 15 ప్రభాతవార్త:**

ఆలయ కమిటీలకు బోనాలు చెక్కులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సోమవారం అందించారు. అల్వాల్, మచ్చబొల్లారం కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనిల్ కిషోర్‌లు ఆధ్వర్యంలో చెక్కులు పంపిణీ జరిగింది. తెలంగాణాకు మణిహారంగా పేర్కొనే బోనాలు ఉత్సవాలు ప్రజలు సుఖ సంతోషాలుతో జరుపుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఆలయాలు వద్ద అవసరమైన వసతులను జిహెచ్ఎంసి పరంగా కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్ ఇతరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు

**యూసుఫ్‌గూడ, జూలై 15, ప్రభాతవార్త :**

తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడం జరుగుతుందని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మీ అన్నారు. సోమవారం శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయ కళ్యాణ మండపంలో జూబ్లిహిల్స్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల బస్తీల కాలనీలకు చెందిన దేవాలయ కమిటీలకు ప్రభుత్వం తరపున చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనీల్‌కుమార్ యాదవ్, జూబ్లిహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మహ్మద్ హజారుద్దీన్, రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సిఎన్‌రెడ్డి, గ్రేటర్ మాజీ ఉపమేయర్ బాబాఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా, సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత, ఖైరతాబాద్ తహశీల్దార్ నజీరుద్దీన్, ఆర్.ఐ కిరణ్‌రాజ్ వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బల్కంపేట్ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 15, ప్రభాతవార్త**

బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం ఆలయంలో ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌రావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలను శాలువాతో ఘనంగా సత్కరించారు.

## జనసేన పార్టీ జెండాలో శ్రీచక్ర యంత్రాన్ని పెట్టడం అన్యాయం

-ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కమల సంతోష్ కుమార్

**చిక్కడపల్లి, జూలై 15 ప్రభాతవార్త:** పరబ్రహ్మస్వరూపం అయినటువంటి ఆదిపరాశక్తి అమ్మవారి శ్రీచక్ర యంత్రాన్ని జనసేన పార్టీ తన జెండాకు ఉపయోగించడం అన్యాయమని, ఇది అమ్మవారి హైందవ ధర్మాన్ని అవమానించడమేనని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కమల సంతోష్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అమ్మవారి చిహ్నాన్ని ఉపయోగించడం హింధూ ధర్మాన్ని తుంగలో తొక్కడమేనని అన్నారు. చట్టానికి వ్యతిరేకంగా కొందరు రాజకీయ నాయకులు వారి ఎదుగుదలకు అమ్మవారి స్వరూపమైనటువంటి శ్రీచక్ర యంత్రంతో రాజకీయాలు చేస్తూ అమ్మవారిని అగౌరవ పరుస్తున్నారని విమర్శించారు. ఈ చిహ్నాన్ని అనుమతించిన రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు బాధ్యత వహించాలని, ఈవిషయంలో రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు వివరించారు. పార్టీ జెండా పైన అమ్మవారి శ్రీచక్రాన్ని పెట్టడం సనాతన ధర్మాన్ని అవమానించడమేనన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పునరాలోచించి శ్రీచక్రయంత్రాన్ని తన జెండాను ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. ఎపి సిఎం చంద్రబాబునాయుడు, హోంమంత్రి వంగలపుడి అనితలకు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

## వర్షాకాలంలో అంటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : నాగపూర్ణ



వర్షాకాలంలో అంటు వ్యాధుల పట్ల తీసుకుంటున్న చర్యల గురించి మాట్లాడుతున్న నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్.

**నార్సింగి, జూలై 15 ప్రభాతవార్త :**

వర్షాకాలంలో వేగంగా విస్తరించే అంటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఇతర శాఖల అధికారులతో కలిసి ఆమె అంటు వ్యాధుల పట్ల అనుసరించాల్సిన పద్ధతుల పట్ల చర్చించారు. వరదలు వచ్చినప్పుడు మ్యాన్‌హోళ్లు తీయ వద్దని, ఒకవేళ తీయాల్సి వస్తే అక్కడే పారిశుద్య సిబ్బంది ఉండాలని, వరద తగ్గిన తరువాత తెరిచిన మ్యాన్‌హోళ్లను మూసి ఇంటికి వెళ్లాలని తెలిపారు. ఒకవేళ తెరిచిన మ్యాన్‌హోళ్ల వలన ఎవరైనా ఇబ్బందులు పడితే అక్కడ విధుల్లో ఉన్న కార్మికుడిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని తెలిపారు. అవసరమైన ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్లు చల్లాలని, దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు సైతం తమ ఇళ్లు, ఇంటి పరిసరాలలో నీరు, చెత్త నిలువ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంటు వ్యాధులు వచ్చిన తరువాత అవస్థలు పడేకన్నా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ఉత్తమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మౌలిక వసతుల కల్పనకు అహర్నిశలు కష్టపడుతున్నా : తలారి చంద్రశేఖర్

**నార్సింగి, జూలై 15 ప్రభాతవార్త :** మౌలిక వసతుల కల్పనకు అహర్నిషలు కష్టపడుతున్నానని బండ్లగూడ కార్పోరేషన్ ఒకటో వార్డు కార్పోరేటర్ తలారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ఒకటో వార్డులోని ఇందిరమ్మ కాలనీలో రూ.34.లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ప్రతీ హామీని చేతల్లో చేసి చూపిస్తున్నానని తెలిపారు. ముఖ్యంగా మౌలిక వసతులైన తాగునీరు, డ్రైనేజి, వీధి దీపాలు, సీసీ రోడ్లు వంటి వాటికి అధిక ప్రాధాన్యతనిచ్చి వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ కాలనీలో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద ప్రజలే అధికంగా ఉంటున్నారని, రెండు దశాబ్దాల నుంచి ఇక్కడ ఏ నాయకుడు సీసీ రోడ్లు వేయలేదని, తొలి సారిగా ఇప్పుడు సీసీ రోడ్లు వేయిస్తున్నామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ కాలనీ అభివృద్దికి పూర్తి సహకారం అందిస్తానని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డికు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కాలనీ అధ్యక్షులు ధన్నాడ లక్ష్మణ్, కాలనీ వాసులు కృష్ణ సాగర్, అజ్జు, రామ్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

### గీత కార్మికులకు కాటమయ్య కిట్లు పంపిణీ చేయడం అభినందనీయం

**చిక్కడపల్లి, జూలై 15 ప్రభాతవార్త:** కల్లుగీత వృత్తిలో ప్రమాద నివారణకు సేఫ్టీ మోకులు గీత కార్మికులకు పంపిణీ చేయడం అభినందనీయమని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కల్లుగీత వృత్తిలో సంవత్సరానికి 500మందికిపైగా చనిపోవడం, వికలాంగులవడం జరుగుతోందని, వీటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని గత అనేక సంవత్సరాలుగా కల్లుగీత కార్మిక సంఘం ప్రభుత్వాల దృష్టికి తెస్తున్న విషయం తెలిసిందే. 2022 అక్టోబరు 21న కల్లుగీ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా యాదగిరిగుట్టలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం చొరవతో రూపొందించిన సేఫ్టీమోకు డెమో ఇప్పించడం జరిగిందని, కల్లుగీత కార్మిక సంఘం చేసిన పలు సూచనలతో రూపుదిద్దుకొన్న సేఫ్టీమోకులు జూలై 14న లష్కర్‌గూడలో సిఎం రేవంత్‌రెడ్డి పరిశీలించి వాటిని పంపిణీ చేసినందుకు రాష్ట్ర కమిటీ తరపున అభినందించారు. అందకు కృషి చేసి బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, టాడీ కార్పొరేషన్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.వీటిని రాష్ట్రంలోని గీత కార్మికులందరికి ఉచితంగా ఇవ్వాలని, ఇప్పటికే పడి చనిపోయిన వారి కుటుంబాలకు, వికలాంగులకు ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా వెంటనే ఇవ్వాలని కోరారు.

# బయోడైవర్స్ ఫ్లైఓవర్ మీద మరో రోడ్డు ప్రమాదం...

-ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

-ఫ్లైఓవర్ మీద నుంచి కింద పడి వ్యక్తి మృతి

**గచ్చిబౌలి, జూలై 15 ప్రభాతవార్త**

బయోడైవర్‌సిటీ మరో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఫ్లైఓవర్ మీద నుంచి వెళ్తున్న ఓ ద్విచక్రవాహనదారుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ద్విచక్రవాహన దారుడు ఫ్లైఓవర్ మీద నుంచి కింద ఉన్న రోడ్డు మీద పడి తీవ్ర గాయాలతో మృతిచెందాడు. సోమవారం తెల్లవారు జామున ఈ ఘటన చోటుచేసుకుంది. బయోడైవర్‌సిటీ ఫ్లైఓవర్ ప్రారంభించిన నాటి నుంచి తరచూ ప్రమాదాలతో రక్తమోడుతోంది. పోలీసులు ఎన్ని రక్షణ చర్యలు తీసుకున్నా ప్రమాదాలను నివారించలేకపోతున్నారు. తాజా ఘటనలో ద్విచక్రవాహనం మీద ఐటి కారిడార్‌లో టిఫిన్లు అమ్ముకునే వ్యాపారి మృతిచెందడం విషాదాన్ని నింపింది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడకు చెందిన సుబ్బారావు(38) తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి నగరానికి వలస వచ్చాడు. రాయదుర్గంలోని హుస్సేనీషావలిలో గల ఎంఎస్ కన్వెన్షన్ సమీపంలో నివాసం ఉంటూ ఐటి కారిడార్ పరిధిలో తన టివిఎస్ ఎక్సెల్ వాహనం మీద టిఫిన్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజు రాయదుర్గం నుంచి కూకట్‌పల్లి కైత్లాపూర్‌లోని క్రికెట్ గ్రౌండ్ వద్దకు తన వాహనం మీద వచ్చి, టిఫిన్లు అమ్మి తిరిగి ఇంటికి వెళ్లిపోతాడు. అదే క్రమంలో సోమవారం తెల్లవారుజామున సైతం తన టివిఎస్ ఎక్సేల్ మీద టిఫిన్స్ తీసుకొని రాయదుర్గంలోని ఇంటి నుంచి కూకట్‌పల్లికి బయలుదేరాడు. మార్గమధ్యలో గచ్చిబౌలి బయోడైవర్‌సిటీ ఫ్లైఓవర్ మీదుగా హైటెక్‌సిటీ వైపు వెళ్తుండగా, ఉదయం 5.30 ప్రాంతంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం సుబ్బారావు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదం దాటికి ద్విచక్రవాహనం కిందపడిపోగా, సుబ్బారావు ఫ్లైఓవర్ మీద నుంచి ఎగిరి కింద ఉన్న రహదారి మీద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన సుబ్బారావు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



బయోడైవర్‌సిటీ ఫ్లైఓవర్ మీద ప్రమాదానికి గురైన సుబ్బారావు వాహనం

## విద్యాశాఖ మంత్రిని నియమించి.. విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

-బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ



విద్యార్థులతో కలిసి మాట్లాడుతున్న వేముల రామకృష్ణ తదితరులు

**హైదరాబాద్,జూలై 15,ప్రభాతవార్త:**

రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని ..అలాగే విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నాటక తరాహాలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25శాతం సీట్లును పేదవిద్యార్థులకు కేటాయించాలన్నారు. అలాగే కోట్లలో పెండింగ్‌లో ఉన్న ఫీజుల రియంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ స్కూళ్లలో పదోతరగతి విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేసి డిజిటల్ క్లాసులు నిర్వహించాలన్నారు. ఐడెంటీకార్డు తోపాటు సూటుబూట్లను ప్రభ్వుమే అందించి కార్పోరేట్ బడులకు దీటుగా తీర్చిదిద్దాలన్నారు. అంతేకాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు ప్రాధాన్యత కల్పించి అధిక బడ్జెట్ కేటాయించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈసమావేశంలో విద్యార్థులు పల్లవి, అంకిత, ఉమా, రాణి, శిరీష, దివ్య, ప్రీతి, రమేష్, రఘు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

### సెక్యూరిటీ గార్డ్ వద్ద గంజాయి పట్టివేత..

**దుండిగల్, జూలై 15, ప్రభాతవార్త**

ఆదివారం అర్ధరాత్రి ఓస్‌టిటి, పిఎస్ దుండిగల్ వారి సంయుక్త ఆపరేషన్‌లో గాగిలాపూర్‌లోని ఒక ఇంటిలో అద్దెకి ఉంటున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా అతని వదనద నుండి 3.8కేజీల గంజాయిని స్వాధీన పరుచుకుని అతని మీద కేసు నమోదు చేసి సోమవారం కోర్టుకు పంపడం జరిగింది. శుభకంఠ జన వృత్తిరీత్యా సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. శుభకంఠ జన రెండు సంత్సరాల క్రితం ఒరిస్సా నుంచి గాగిలాపూర్ వచ్చి రూమ్ అద్దెకి తీసుకొని నివసిస్తున్నాడు. ఈ మధ్యనే ఒరిస్సాలోని తన మిత్రుడు అయినా జిల్లు అనే వ్యక్తి ద్వారా దాదాపు నాలుగు కేజీల గంజాయిని రూ.15000కు తీసుకున్నాడు. దాన్ని శుభకంఠకు తెలిసిన అమిత్‌కు అమ్మి సొమ్ము చేసుకోవాలని అనుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ, దుండిగల్ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై ఇదివరకు ఎటువంటి గంజాయి కేసులు లేవు. కేవలం డబ్బు ఆశతో ఈ పని చేసినట్టుగా అంగీకరించాడు. పరారీలో ఉన్న జిల్లు, అమితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

### ట్రాన్స్‌జెండర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు..



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సురేష్ కుమార్

**సంజీవ్‌రెడ్డి నగర్, జూలై 15, ప్రభాతవార్త**

సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 12వ తారీకున మృతి చెందిన ట్రాన్స్‌జెండర్ హత్య కేసును సనత్‌నగర్ పోలీసులు ఛేదించారు. ఈ సందర్భంగా సోమవారం సనత్‌నగర్ డీసీపీ సురేష్ కుమార్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ట్రాన్స్‌జెండర్ సుశీలను హత్య చేసింది సాగర్ సింగ్ తో పాటు ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. డబ్బు కోసమే ట్రాన్స్‌జెండర్ సుశీల హత్య చేసినట్లు నిందితులు అంగీకరించినట్లు తెలిపారు. హత్య చేసిన వారిలో సాగర్ సింగ్, ప్రవీణ్, విశ్వజిత్ అభినవ్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. సాగర్ సింగ్ 19 కేసుల్లో నిందితుడు దొంగతనాల కేసులు అతనిపై పిడి యాక్ట్ కూడా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ ఎం.హనుమంతరావు, బాలానగర్ ఇన్స్‌పెక్టర్ నవీన్ కుమార్, సనత్‌నగర్ ఇన్స్‌పెక్టర్ ఏ.పురేందర్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ నాగిరెడ్డి, సనత్‌నగర్ సిబ్బంది పాల్గొన్నారు.

### హత్యలను పసిగట్టడంలో ఇంటిలిజెన్స్ విభాగం విఫలం

**సైఫాబాద్, జులై 15 ప్రభాతవార్త:**

పాత నగరంలో ఇటీవల జరిగిన హత్యలపై ఇంటలిజెన్స్ విభాగం ముందుగా గుర్తించడంలో విఫలం చెందిందని జమియ్ ఉలమా ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల కార్యదర్శి ముక్తి మేరాజుద్దీన్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా ప్రభుత్వం ఇంటలీజెన్స్ విభాగాన్ని పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. శాంతి, సామరస్యాన్ని కాపాడటంలో హైదరాబాద్ నగరం చాలా కాలంగా కొనసాగుతున్నదని, హింసంకు దూరంగా ఉంటున్నదన్నారు. ఇది ప్రపంచ పెట్టుబడి దారులు, స్థానిక వ్యాపారుల మౌలిక సదుపాయాల నుంచి పెట్టుబడులను అకర్షిస్తున్నదని ఆయన తెలిపారు.హైదరాబాద్ నగరంలో ఇప్పటి వరకు పోలీసులు అత్యున్నతమైన సేవలు అందించారని, కాని పాత నగరంలో జరిగిన హత్యలను ముందుగా అంచనా వేయడంలో ఇంటలిజెన్స్ విభాగం విఫలం చెందిందన్నారు. మైనార్టి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని, విదేశాల్లో విద్యను అభ్యసించడానికి అవకాశం కల్పించాలని, మైనార్టి రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులతో భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# అంగరంగ వైభవంగా పెద్దమ్మతల్లి శాకంబరి ఉత్సవాలు

-వేలాదిగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్న భక్తులు

-గత మూడు రోజుల నుండి నిత్య హారతులతో శోభాయమానంగా అమ్మవారు

**పంజగుట్ట, జూలై 15 (ప్రభాతవార్త):**

జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయంలోని అమ్మవారి శాకంబరి ఉత్సవాలు గత మూడు రోజుల నుండి అంగరంగ వైభవంగాజరిగాయి.ఈ మూడు రోజుల నుంచి అమ్మవవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులందరూ ఈ మహత్తరమైన శాకంబరి ఉత్సవాలను కనులారా తిలకించి శ్రీ పెద్దమ్మ వారి తీర్ధ ప్రసాదములు స్వీకరించి ఆ లోకమాతఆదిపరాశక్తి,ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి స్వరూపిణి, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకి అయిన పెద్దమ్మ తల్లి కృపాకటాక్షములకు వేలాది మంది భక్తులు పాత్రులై తరించారని ఆలయ ఫౌండర్ ట్రస్టీలు పి. ఇందిరా జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డిలు వివరించారు.చివరి రోజైన శాకంబరి ఉత్సవాలలో భాగంగా ఉదయం 6 గంటలకు దర్శనము, హారతి, మంత్ర పుష్పము,తీర్ధ ప్రసాత వినియోగములు, మధ్యాహ్నం నుంచి పూర్ణాహుతి, మంత్రపుష్పం, చండీహోమం, బలిహోమం,కలశోద్వాసన, ప్రోక్షణ,ఆశీర్వచనములు, ఋత్విక సన్మానములు నిర్వహించారు. ఇక చివరిగా శ్రీ పెద్దమ్మవారి ఉత్సవ మూర్తి పల్లకిసేవ, విశేష బాణ, సంచా విన్యాసములు గావించారు.ఇప్పటి వరకు దేవస్థానంలో అలంకరణ గావించిన కూరగాయలను భక్తులనుయవితరణ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాసరాజు పేర్కొన్నారు. శాకంబరి ఉత్సవాలలో భాగంగా ట్రస్టీ పి.విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు సోమవారం ప్రత్యేక యాగంలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.శాకంబరి ఉత్సవాలలో భాగంగా మూడురోజుల నుండి అమ్మవవారికి ప్రతినిత్యము దేవాలయ ప్రాంగణమంతా వివిధ కూరగాయాలతో అలంకరించిన విధానం భక్తులను విశేషంగా అలరించింది.



ప్రత్యేక యాగం నిర్వహిస్తున్న ఆలయ ట్రస్టీ పి. విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు

## బోనాలు ఘనంగా నిర్వహించుకునేందుకు చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే



బోనాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

**ముషీరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** ఎంతో ప్రసిద్ది చెందిన శ్రీకనకాల కట్టమైసమ్మ ఆలయంలో బోనాలు ఘనంగా నిర్వహించుకునేందుకు చర్యలు చేపట్టాలని వివిధ శాఖాధికారులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశించారు. సోమవారం కట్టమైసమ్మ ఆలయంలో బోనాల బ్రోచర్‌ను ఆయన స్థానిక కార్పోరేటర్ రచనశ్రీ, ఆలయ ఫౌండర్ చైర్మన్ గోల్కొడ గౌతంకుమార్ పటేల్, సర్కిల్ 15 డీఎంసీ మోయినుద్దీన్, చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కట్టమైసమ్మ ఆలయంలో ఆషాడమాసంలో జరిగే బోనాల పండుగకు నగర నలుమూలల నుండి భక్తులు భారీగా పాల్గొంటారని గుర్తు చేశారు. బోనాల సందర్భంగా భక్తులకు, బోనాలు సమర్పించే మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులందరూ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్‌పోలీసులు, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా లా అండ్ ఆర్డర్ పోలీసులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ఆలయ పరిసరాలలో ఎలాంటి పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులు, వాటర్‌వర్క్స్ అధికారులు చూడాలని, వీధిదీపాలు ముందుగా మరమ్మత్తులు చేయించి, ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్పోరేటర్ రచనశ్రీ మాట్లాడుతూ దేవాలయం వద్ద బోనాల సందర్భంగా వేసే తాత్కాలిక షెడ్లకు బదులు శాశ్వత షెడ్లు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ సురేఖవాణి, దోమలగూడ ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంహెచ్ఓ మైత్రేయి, స్ట్రీట్‌లైట్ ఏఈ జ్యోతిర్మయి, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీధర్, ఆలయ ఈవో సాంబశివరావు, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, ఆలయ అర్చకులు సాత్విక్‌శర్మ, సిబ్బంది సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బండ్లగూడలో అంగన్వాడీల బలోపేతానికి కృషి : మేయర్ లతా ప్రేమ్‌గౌడ్

**నార్సింగి, జూలై 15 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో అంగన్వాడీల బలోపేతానికి కృషి చేస్తున్నామని మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం కార్పోరేషన్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో "అమ్మ మాట అంగన్వాడీ బాట" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ లతాగౌడ్ చిన్నారులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులను ఆడిస్తూ, పాడిస్తూ అక్షరాలు నేర్పిస్తున్న తీరు చాలా బాగుందన్నారు. అంగన్వాడీలను మరింత బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. అంగన్వాడీలకే సొంత భవనాలు నిర్మించి ఇవ్వడంతో పాటు బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు అవసరమైన పోషకాహారంను కూడా ఇక్కడే అందిస్తున్నారన్నారు. తల్లులు ఆకు కూరలు, చిరు ధాన్యాలు ఎక్కువగా తీసుకుంటే గర్భంలోని పిండమైనా, పాలు తాగే పిల్లలైనా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ముఖ్యంగా సీజనల్ పళ్లను తీసుకున్న వారిలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందని తెలిపారు. మరుగుదొడ్డి లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్న విషయంను తెలుసుకున్న మేయర్ వెంటనే ఇక్కడ మరుగుదొడ్డిని నిర్మించి ఇస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు నాగలక్ష్మి, సరస్వతీ, షాలిని, మెప్మా రీసోర్స్ పర్సన్ వనజ, ఆశా వర్కర్ విజయ తదితరులు పాల్గొన్నారు.



బండ్లగూడలో జరిగిన అమ్మమాట అంగన్వాడి బాట కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ లతా ప్రేమ్‌గౌడ్

## డ్రగ్స్ రహిత తెలంగాణలో విద్యార్థులు భాగస్వామ్య కావాలి : ఏసిపి శ్రీనివాసరావు



డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఏసిపి శ్రీనివాసరావు

**మూసాపేట్, జూలై 15, ప్రభాతవార్త :**


డ్రగ్స్ రహిత తెలంగాణలో విద్యార్థులు భాగస్వామ్య కావాలని విద్యార్థులకు ఏసీపీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం కూకట్‌పల్లిలోని స్థానిక అశోక గార్డెన్స్‌లో వివేకానంద డిగ్రీ కాలేజ్ అన్యువల్ డే సెలబ్రేషన్స్‌లో ఏసీపీ శ్రీనివాసరావు ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదువుకొని ప్రభుత్వ ఇస్తున్న ఉద్యోగ నోటిఫికేషన్లను ఉపయోగించుకుని ప్రభుత్వ ఇస్తున్న ఉద్యోగ నోటిఫికేషన్లను ఉపయోగించుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ప్రజలకు సేవ చేయాలన్నారు. అదేవిధంగా విద్యార్థులు ఎవరూ డ్రగ్స్‌కు బానిసలు కాకూడదని, ఎవరైనా డ్రగ్స్ సేవిస్తే వారిపట్ల పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి ఇన్ఫర్మేషన్ ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థుల అందరిచేత డ్రగ్స్ రహిత తెలంగాణలో భాగస్వాములు కావాలని ప్రమాణం చేయించారు. తదనంతరం కాలేజ్ చైర్మన్‌డా.కొరదాల నరేష్ మాట్లాడుతూ భారతదేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని, దేశ అభివృద్ధిలో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని విద్యార్థులందరూ ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ సాధించాలని భారతదేశ యొక్క ఖ్యాతి ప్రపంచ దేశాలకు తీసుకువెళ్లడంలో విద్యార్థుల పాత్ర అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఇన్స్‌పెక్టర్ ముత్తు, కాలేజ్ డైరెక్టర్ కె.వి. లావణ్య, ఆర్గనైజ్ డీన్ మౌనిక, ప్రిన్సిపల్ బి.ఎన్.రాజేష్, వైస్ ప్రిన్సిపల్ భాగ్య, స్టూడెంట్స్ డీన్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.


## శృతిమించుతున్న సైబర్ నేరాలు

**అల్వాల్, జూలై 15 ప్రభాతవార్త:**

సైబర్ నేరగాళ్ల అగడాలు శృతిమించుతున్నాయి. మాయ మాటలుతో బురిడీ కొట్టిస్తున్న వీరు అందిన కాడికి దండుకుంటున్నారు. సోమవారం అల్వాల్‌లో ఇటువంటి సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఆర్టీలో పని చేస్తున్న మదుసూధన్ మచ్చబొల్లారం నివాసం ఉంటున్నారు. ఈ నెల 15 సోమవారం గుర్తు తెలియన నెంబరు నుంచి ఫోన్ కాల్ అతనికి వచ్చింది. స్పెషల్ బ్రాంచి పోలీసులమని కొడుకు రాహుల్ డ్రగ్స్ కేసులో అదుపులోకి తీసుకున్నామని పోలీసు స్టేషన్‌కు రావాలని ఫోన్ కట్ చేయడం జరిగింది. విషయం తెలుసుకోవడానికి మదుసూధన్ కొడుకుకు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. రాహుల్ ముందు రోజు స్నేహితులుతో కలిసి టూర్‌కు వెళ్ళాడు. కొద్ది సేపటికే మరలా ఫోన్ చేసి కేసు నుంచి రాహుల్‌ను పక్కకు జరపడానికి ముందుగా 50 వేలు రూపాయలు ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయాలని సదరు వ్యక్తి కోరారు. కొడుకు ఫోన్ స్విచ్ఛాఫ్‌గా ఉండడంతో బాధితుడికి అనుమానం వచ్చింది. నిజంగానే రాహుల్ ఇబ్బందులో ఉన్నాడని నమ్మిన మదుసూధన్ ఫోన్ చేసిన వారు చెప్పిన అకౌంట్‌కు 50వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. కొంత సేపటికి మరోసారి ఫోన్ చేసిన నేరగాడు డబ్బు సరిపోదు మరో లక్ష ట్రాన్స్‌ఫర్ చేయాలని చెప్పాడు. అంతా గందరగోళంగా ఉన్న సమయంలో కోడుకు రాహుల్ నుంచి ఫోన్ వచ్చింది. డ్రగ్స్ కేసు ఏమిటి స్పెషల్ బ్రాంచి పోలీసులు ఫోన్‌లు చేస్తున్నారని డబ్బులు ఇచ్చానని తెలిపాడు. కంగుతిన్న అతను తిరుమలలో స్వామి వారి దర్శనం కోసం వెళ్ళానని అందుకు ఫోన్ స్విచ్చాఅఫ్ చేసినట్లు తండ్రికి తెలిపాడు. మోసం జరిగిందని గుర్తించిన రాహుల్ అల్వాల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తండ్రికి తెలిపాడు. బాధితుడు పోలీసు లకు ఫి ర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు : ఏసిపి ఖాదర్





**అత్తాపూర్ జూలై15,ప్రభాతవార్త :**

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఏసిపి ఖాదర్ హెచ్చరించారు.సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శ్రీదేవి కాలనీలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఏసిపి ఖాదర్ రంగంలోకి దిగి కూల్చివేయించారు.ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ.....అనుమతుల విరుద్ధంగా అక్రమంగా నిర్మాణాలు చేపడితే నిర్మాణాలు కూల్చివేయడంతో పాటు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలని లేకుంటే నిర్మాణాదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

## అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో రూ.2.95 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

**జోగిపేట, జూలై 15, ప్రభాతవార్త:** అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో రూ.2.95కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ కమిషనర్ తిరుపతి తెలిపారు. సోమవారం జోగిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ గూడెం మల్లయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో డివైడర్ సెంట్రల్ లైటింగ్ మరమ్మతులు, వర్షాకాలం నేపథ్యంలో అన్ని వార్డులలో శానిటేషన్ నిర్వహణ, సిసి రోడ్లు, మురికి కాలువలు తదితర చేపట్టాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైస్‌ఛైర్మెన్ ప్రవీన్‌కుమార్, కౌన్సిలర్లు సురేందర్ గౌడ్, చిట్టిబాబు, డాకూరి శంకర్, కొరబోయిన నాగరాజు(నాని), హరిక్రిష్ణగౌడ్, దుర్గేష్, చందర్, పట్లోల్ల రేఖాప్రవీన్, రాచకొండ భవాని, గాజుల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆశాడి ఉత్సవాలకు ఆహ్వానం



నర్సా రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

**మర్కుక్, జూలై 15 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాండురంగాశ్రమం 93వ ఆశాడి ఉత్సవాలకు హాజరుకావాలని ఆశ్రమం నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు నర్సా రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా తూంకుంట నర్సా రెడ్డి ఆశాడి ఉత్సవాలలో తప్పకుండా పాల్గొని శ్రీ రుక్మిణి పాండురంగస్వామిని దర్శించుకుంటానని తెలిపినట్లు ఆశ్రమ నిర్వాహకులు పేర్కొన్నారు.

## డంపింగ్ యార్డును పరిశీలించిన మున్సిపల్ ఛైర్మన్



డంపింగ్ యార్డు వద్ద నాటిన మొక్కలను పరిశీలిస్తున్న రాజమౌళి

**గజ్వేల్ టౌన్, జూలై 15 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డును మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను కాపాడుకునే బాధ్యత మనదే అన్నారు. తడిచెత్త, పొడిచెత్తను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే 6వ వార్డు సంగుపల్లిలో మురికికాల్వ సమస్యను పరిశీలించి వెంటనే మరమ్మతు చేయాలని మున్సిపల్ ఏఈని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, 6వ వార్డు కౌన్సిలర్ బబ్బూరి రజితగౌడ్, ఏఈ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాములపర్తిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**మర్కుక్, జూలై 15 (ప్రభాతవార్త):** మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు పాములపర్తి సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. 32 ఏళ్ల తర్వాత ఒక చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు వారికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు నరహరిరావు, విఠల్, ఆంజనేయులు, రాంరెడ్డి, ప్రభాకర్, మహబూబ్‌అలీతో పాటు పూర్వ విద్యార్థులు శ్రీధర్‌రెడ్డి, పద్మాకర్, గోవర్ధన్‌రెడ్డి, అన్నపూర్ణ, నాగలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**బెజ్జంకి, జూలై 15, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కల్లెపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు బుర్ర ప్రభాకర్ తండ్రి బుర్ర మల్లయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబీకులను సోమవారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. అయన వెంట పార్టీ నాయకులు పాకాల మహిపాల్‌రెడ్డి, లింగాల లక్ష్మణ్, కచ్చు రాజయ్య తదితరులు ఉన్నారు.

## పాండురంగాశ్రమంలో ఘనంగా ఆశాడి ఉత్సవాలు

**మర్కుక్, జూలై 15 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాండురంగాశ్రమంలో 93వ ఆశాడి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మండలం నుండే కాకుండా వివిధ జిల్లాల నుండి పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. సోమవారం ఉత్సవాల్లో భాగంగా భవాని రామలింగేశ్వరస్వామికి శత రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన నల్లకుంట రామాలయం భక్తులచే ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు హరే రామ నామ భజన సంకీర్తనం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆశ్రమం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఆశాడి ఉత్సవాలు గురువారం వరకు కొనసాగుతాయని తెలిపారు.



ఆశ్రమంలో హరే రామ నామ సంకీర్తన చేస్తున్న దృశ్యం

# భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి



జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన పిసిసి అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, రాజీరెడ్డి

**నర్సాపూర్, జూలై 15, ప్రభాతవార్త:** నర్సాపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో రీజనల్ రింగ్ రోడ్డు(ట్రిబుల్ ఆర్)లో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం మెదక్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజక వర్గ ఇంచార్జి ఆవుల రాజీరెడ్డి భూ నిర్వాసితులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రిబుల్ ఆర్ వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వానికి వివరించాలని కోరారు. గతంలో రెడ్డిపల్లి గ్రామంలో మెదటగా కాళేశ్వరం ప్రాజెక్టుకు, హైటెన్షన్ వైర్లకు, కొండపోచమ్మ కాలువలకు భూమలు కోల్పోయారని ప్రస్తుతం రీజనల్ రంగ్ రోడ్డు వల్ల గ్రామంలోని అనేక మంది రైతులు పూర్తిస్థాయిలో భూమలు కొల్పోవాల్సి వస్తుందని వారు అన్నారు. రైతులకు న్యాయం జరిగే విధంగా జిల్లా ఇంచార్జి మంత్రి సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు మాజీ జెడ్పిటీసి శ్రీనివాస్ గుప్త, నర్సాపూర్ మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం, కొల్చారం మండల పార్టీ అధ్యక్షులు మల్లేశ్ గౌడు, శివంపేట మండల పిఎసిఎస్ చైర్మెన్ వెంకట్రామి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మధుసూధన్, ఆశోక్ గౌడు, రైతులు నిరంజన్, శేఖర్, సత్యనారాయణ, దయాకర్, నాగేష్ తదితరలు పాల్గొన్నారు.



## రామకోటి రామరాజుకు ఘన సత్కారం

**సిద్దిపేట అర్బన్, జూలై 15, ప్రభాతవార్త :** గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమజం వ్యవస్థాపక అధ్యక్షులు రామకోటి రామరాజుకు భక్తిరత్న జాతీయ పురస్కారం వచ్చిన సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మార్కండేయ స్వామి దేవాలయంలో సోమవారం శ్రీరామభక్త బృందం అధ్వర్యంలో రామకోటి రామరాజును శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ భక్త బృ ందం ప్రతినిధులు మాట్లాడుతూ శ్రీరామ తారక మంత్రాన్ని 25 ఏళ్లగా నిర్విరామంగా లక్షల మంది భక్తులచే తెలంగాణ, ఎంపి, అమెరికాలాంటి ప్రాంతాల నుంచి లిఖంపచేయడం ఆయన రామభక్తికి నిదర్శ నం అన్నారు. కార్యక్రమంలో శ్రీరామ బృందం ప్రతినిధులు తంగళపల్లి నరేష్, అయిత శ్రీకాంత్, బొల్లం శ్రీనుగౌడ్, జపా మధుసూదన్‌రెడ్డి, మామిడాల సురేష్, నాగేందర్, వేణు, చిరంజీవి, అర్చకులు మల్లిపెద్ది నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

## మొక్కలు నాటడంతో పాటు సరంక్షించాలి : ఎమ్మెల్యే



మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**పెద్దశంకరంపేట, జూలై 15 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా సోమవారం పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. మొక్కలను నాటడంతో పాటు వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా, తహశీల్దార్ గ్రేసీబాయి, ఎస్ఐ శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయిని మధు, నాయకులు ఆర్ఎన్. సంతోష్‌కుమార్, నారాగౌడ్, దాచా సంగమేశ్వర్, అలుగుల సత్యనారాయణ, సుభాష్‌గౌడ్, సాయిరెడ్డి, పెరుమాండ్లగౌడ్, అంజిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు విఠల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి : ఎస్ఐ



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ శంకర్

**పెద్దశంకరంపేట, జూలై 15 ప్రభాతవార్త:** పండుగలను ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ శంకర్ అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో మొహర్రం పండుగ సందర్భంగా నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మొహర్రం పండుగను అందరూ కలిసి ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, సుభాష్‌గౌడ్, భానుగౌడ్, యాదుల్, సలీం, మొక్రం, జావిద్, ముల్తాని ముక్తార్, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

## శివ్వంపేటలో పీస్ కమిటీ సమావేశం



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ మహిపాల్‌రెడ్డి

**శివ్వంపేట, జూలై 15 ప్రభాతవార్త:** పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోహర్రం పండుగను ముస్లింలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని, శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని ఎస్ఐ మహిపాల్‌రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీసులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి : సిడిపివో

**పెద్దశంకరంపేట, జూలై 15 ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అల్లాదుర్గం సీడీపీవో హేమభార్గవి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలోని రైతువేదికలో అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేట మండలాల అంగన్వాడీ టీచర్లతో నిర్వహించిన ప్రాథమిక విద్య శిక్షణ శిబిరంలోపాల్గొని మాట్లాడారు. అంగన్వాడీకేంద్రాలలో అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యను కూడా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలి

**కొల్చారం, జూలై 15 ప్రభాతవార్త:** సింగూర్ ప్రాజెక్టు నుండి ఘనపూర్ ఆనకట్టకు నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మారెల్లి అనిల్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా సరిగ్గా వర్షాలు కురవపోవడంతో రైతులు ఇంకా వరినాట్లు వేయలేదని, సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని ఘనపూర్ ఆనకట్టకు విడుదల చేస్తే రైతులు సకాలంలో నాట్లు వేస్తారరని అన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టరన రాహుల్ రాజ్‌ను కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు భూమయ్య, మధుసూదన్‌రెడ్డి, ఉన్నారు.

## నెలాఖరులోగా రైతు భరోసా నిధులను జమ చేయాలి

**-టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమాదిగ**



మాట్లాడుతున్న టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ

**కొల్చారం, జూలై 15 ప్రభాతవార్త:** పెట్టుబడికి డబ్బులు లేక రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ నెలాఖరులోగా రైతు భరోసా నిధులను జమ చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మాదిగ అన్నారు. సోమవారం కొల్చారం మండల పరిధిలోని సంగాయిపేట గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మాదిగ మాట్లాడుతూ వానాకాలం మొదలై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులు జమచేకయ పోవడం బాధాకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం రైతు భరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.

## మొక్కలు పెంచడం అందరి బాధ్యత : నర్సయ్య



చిన్నగొట్టిముక్కులో మొక్కలు నాటుతున్న ప్రత్యేక అధికారి నర్సయ్య

**శివ్వంపేట, జూలై 15ప్రభాతవార్త:** మొక్కలు పెంచడం అందరూ బాధ్యతగా తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి నర్సయ్య అన్నారు. సోమవారం చిన్నగొట్టిముక్కల గ్రామంలో జెడ్పీ ఉన్నతపాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి నర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని తెలిపారు. గ్రామంలో మొత్తం 650 మొక్కలు నాటడం జరిగిందని, వాటిని సరంక్షించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, ఏపీవో అనిల్, ప్రధానోపాధ్యాయురాలు ఇందుమతి పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్స్ అందచేత

**పటాన్‌చెరు, జూలై 14,ప్రభాతవార్త:** పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలోని ఎంపీపై యాస్ అలాగే జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో పార్కర్ హనీ ఫిన్ ఇండియా అలాగే లడ్ వారి సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛదం సంస్థ ఎడ్యూకేషన్ కిట్స్ ఆటవస్తువులు అందచేశారు. ఈ సందర్భంగా మెడ్వాన్ డైరెక్టర్ హెచ్ మదు సుధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో ముందుండాలని ఎడ్యుకేషన్ కిట్స్ అందచేశామన్నారు. ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రభుత్వ పాఠశాలలను బలోపెతం చేయుటకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారద మాట్లాడుతూ మా పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు మా తరుపున, విద్యార్థుల తరుపున మా విద్యార్థుల తరుపున అభినందనలు, తెలియచేస్తున్నామని అన్నారు. యపిపిఎస్ పాఠశాల హెడ్ మాస్టర్ జనార్ధన్, జానా, సిడబ్ల్యూసి సభ్యుడు జీ వెంకటేష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అండాలు, ఈశ్వరమ్మ, పార్కర్ కో ఆర్డినేటర్ హాఫీజ్ మెడ్వన్ కోఆర్డినేటర్ మహజేబు మరియు మెడ్వాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్స్ అందిస్తున్న దృశ్యం



అభివృద్ధి పనులను ప్రార oభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

## పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**బెజ్జంకి, జూలై 15, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. ముత్తన్నపేట గ్రామంలో తాగు నీటి సౌకర్యార్థం వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎల్లంపల్లి గ్రామంలోగల అదర్శ పాఠశాలలో రూ.5 లక్షలతో నిధులతో నూతనంగా నిర్మించిన వంటగదిని ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వనమహోత్సవంలో భాగంగా విద్యార్థులతోకలిసి మొక్కలు నాటారు. ఎంపిడిఓ కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 36 మందికి సిఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు రూ.6 లక్షల 500 విలువ చేసే చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఓ బండి లక్ష్మప్ప,మండల ప్రత్యేక అధికారి, పార్టీ నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**కంగ్టి, జూలై 15 ప్రభాతవార్త:** పేద ప్రజలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి అన్నారు. సోమవారం కంగ్టి మండలానికి చెందిన 15 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీకి సంబంధించిన బిల్లులను ఆయా ఆసుపత్రులకు చెల్లించక పోవడంతో పేదలు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. కాగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.5 లక్షల ఆరోగ్య శ్రీ పథకానికి రూ.10 లక్షల వరకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవడానికి నిధులు కూడా కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచి పల్లవి పరశురామ్ రాథోడ్, జాదవ్ చందర్, జ్నానేశ్వర్, వైజ్యనాథ్, గనేష్, తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ విత్తనాలపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

**అక్కన్నపేట, జూలై 15, ప్రభాతవార్త:** అక్కన్నపేట మండలం పెద్దతండా గ్రామంలోని రైతులు వరిసాగు చేసుకునేందుకు 100 ఎకరాలకు జమ్మికుంటలోని ప్రకాశం విజ్ఞాన కేంద్రం నుండి తెచ్చుకున్న విత్తనాలలో నాణ్యత లేదని రైతులు గుగులోతు రాంబాబునాయక్, హేమునాయక్,లింగానాయక్, కసవా నాయక్, రూప్‌సింగ్, నరసింహాలు ఆరోపించారు. వారు వరి విత్తనాలు తీసుకున్న సందర్భంలో ఒక బస్తా ఒక ఎకరాకు వస్తుందని చెప్పారని,తీరా చూస్తే బస్తా కనీసం 10 గుంటలకు వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.నాసిరకం వరి విత్తనాలు అమ్మి రైతులను మోసం చేసిన జమ్మికుంట ప్రకాశం విజ్ఞాన కేంద్రంపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవడంతోపాటు నష్టపోయిన రైతులను పరిహారం అందించాలని వేడుకుంటున్నారు.

## ఆర్థిక చేయూత ఫౌండేషన్ ఆత్మీయ సమ్మేళనం

**గజ్వేల్ టౌన్, జూలై 15 (ప్రభాతవార్త):** ఆర్థిక చేయూత ఫౌండేషన్ ప్రారంభించి నాలుగు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు గజ్వేల్‌లో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి గ్రామంలో 2020 ఏప్రిల్ మాసం కరోనా సమయంలో ప్రారంభించిన ఆర్థిక చేయూత ఫౌండేషన్ ద్వారా దాదాపు 60 పేద కుటుంబాలకు 50 కిలోల సన్న బియ్యం, 15 రకాల నిత్యావసర సరుకులు అందించి అండగా నిలిచినట్లు తెలిపారు. అలాగే పేద విద్యార్థులకు, అమ్మాయిల వివాహాలకు ఆర్థికసహాయం అందించినట్లు తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా సహాయ కార్యక్రమాలను ఇలాగే కొనసాగిస్తూ ఎంతో మంది పేదలను ఆదుకోవడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**బెజ్జంకి, జూలై 15, ప్రభాతవార్త :** మండల పరిధిలోని దాచారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీసుశాఖ, షీ టీమ్స్ బృందం ఆధ్వర్యంలో షీ టీమ్స్ పనితీరు, సైబర్ నేరాలు నూతన చట్టాలపై అవగాహన సదస్సు కల్పించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ శంకర్‌రావు అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ కు దూరంగా ఉండాలన్నారు. మాయ మాటలు నమ్మిమోసపోవద్దన్నారు. సోషల్ మీడియా వినియోగం తగ్గించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళల భద్రతకు ప్రత్యేకమైన చట్టాలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట షీటీమ్ బృందం కిషన్, మహిళా కానిస్టేబుల్లు మమత, వీణకుమారి, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఫిషరింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శికి సన్మానం

**చిన్నకోడూరు, జూలై 15, ప్రభాతవార్త :** రాష్ట్ర ఫిషరిష్ కార్పోరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ సిద్దిపేట జిల్లా ఫిషరింగ్ కార్పోరేషన్ ప్రధాన కార్యదర్శిగా చిన్నకోడూరుకు చెందిన గుండు వెంకటేష్‌ను నియమించడంతో చిన్నకోడూరు డ్రైవర్స్ యూనియన్ సభ్యులు సోమవారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు కుండే తిరుపతి, ఉపాధ్యక్షులు పోయిలా బిక్షపతి, కోశాధికారి కోనేటి కర్ణాకర్,సహాయ సలహాదారులు వేములవాడ చందు, ఒగ్గు రమేష్, ఇట్టబోయిన బాబు, బబ్బూరు కరుణాకర్, కోనేటీ రాజు,తంబల సంతోష్, చిట్యాల నవీన్, బబ్బురు ప్రశాంత్, ఇట్టబోయిన రమేష్, కోనేటీ మహేష్, అంబటి భరత్, ఎదుల్ల రాజిరెడ్డి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



గుండు వెంకటేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం